9 జిల్లాల్లో నేడు, రేపు వానలు

ప్యారీస్, సెప్టెంబరు 6: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది సాధారణం కన్నా అధికంగా వర్షిస్తున్న నేపథ్యంలో, కొన్ని జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ కనుమలను ఆనుకుని ఉన్న జిల్లాల్లో వారం రోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో బుధ, గురువారాల్లో చెంగల్పట్టు, కాంచీపురం, విల్లుపురం, కడలూరు, డెల్టా జిల్లాలైన మైలాడుదుర్తై, తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం, పుదుకోట సహా పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ శాఖ ప్రకటించింది. నగరంలోని ఒకటి, రెండు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురుస్తాయని, ఆకాశం మేఘావృతమై ఉంటుందని తెలిపింది. గడిచిన 24 గంటల్లో వాలాజా, సేలం జిల్లా ఆతూర్‌లో గరిష్ఠంగా 13 సెం.మీ వర్షపాతం నమోదైంది. చెంగం, కాట్పాడి, సలమై ప్రాంతాల్లో మంగళవారం తేలికపాటి జల్లులు రాలాయి. ఉత్తర జార్ఖండ్ పరిసర ప్రాంతాలను ఆనుకొని బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వాయువ్య దిశగా కదులుతోందని, దీని ప్రభావం వల్ల ప్రకటించిన 9 జిల్లాల్లో రెండు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు అవకాశముందని పేర్కొంది. కాగా, సముద్రంలో 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.



తడిసి ముద్దయిన వరి...

కడలూరు జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు పలు ప్రాంతాల్లో కురిసిన భారీవర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బన్రూట్టి నియోజకవర్గ పరిధిలోని చెమ్మకోట ప్రభుత్వ మార్కెటింగ్ యార్డ్‌కు రైతులు తరలించిన 500లకు పైగా ధాన్యం బస్తాలు వర్షంలో తడిసి ముద్దయ్యాయి. మరోవైపు జిల్లాలో కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు నీటమునిగింది. అప్పులు చేసి ఆరుగాలం పండించిన పంటలు వర్షార్పణమయ్యాయని, ఆర్థికంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బన్రూటి ప్రాంత రైతులు కోరుతున్నారు. వర్షాకాలంలో మార్కెటింగ్ యార్డ్‌కు తరలించే ధాన్యం తడవకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, సేలం జిల్లా మేట్టూరు డ్యాం నీటిమట్టం పూర్తి సామర్థ్యం 120 అడుగులుగా కొనసాగుతోంది. కర్ణాటక పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా అక్కడి నుంచి విడుదల చేస్తున్న మిగులు జలాలతో డ్యాం నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. డ్యాం నుంచి సెకనుకు 26,000 ఘనపుటడుగుల మేర సాగునీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

శిశు, బాలింత మరణాలు లేని పీహెచ్‌సీ సిబ్బందికి అభినందన

ప్యారీస్, ఆగస్టు 6: రామనాథపురం జిల్లాలో శిశు, బాలింత మరణాలు లేని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందిని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం మంగళవారం అభినందించారు. చత్తక్కుపట్టిలోని ప్రభుత్వ ప్రాథమిక కేంద్రాన్ని సందర్శించాలని మంత్రి నిర్ణయించారు. ఆయన 10 గ్రామాల మీదుగా సుమారు 14 కి.మీ నడిచి వెళ్లి పరిశీలించారు. మూడేళ్లుగా ఈ ఆరోగ్య కేంద్రంలో మాతాశిశు మరణాలు లేకుండా ప్రసవాలు నిర్వహించి రికార్డు సృష్టించిన వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందితో కాసేపు కూర్చుని మాట్లాడిన మంత్రి, వారితో కలసి తేనీటి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ఆసుపత్రి అభివృద్ధికి ఎలాంటి సాయం అందించేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ సిద్ధంగా ఉన్నారని హామీ ఇచ్చారు. అనంతరం అక్కడి నుంచి పరమకుడి ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు.



ప్రణాళిక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగింది

ప్రణాళిక కమిటీ సమావేశంలో సీఎం స్టాలిన్

ప్యారీస్, ఆగస్టు 6: కలైంజర్ మహిళా సాధికారిక పథకం వల్ల గృహిణుల ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగిందని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. సచివాలయంలో మంగళవారం ఉదయం రాష్ట్ర ప్రణాళిక కమిటీ ఐదవ సమావేశం సీఎం అధ్యక్షతన జరిగింది. సుమారు గంటపాటు జరిగిన ఈ సమావేశంలో ప్రణాళికా కమిటీ తయారుచేసిన సిద్ధాంతాలు, ప్రభుత్వ పథకాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం సీఎం స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రణాళిక కమిటీలోని సభ్యులు తమ అనుభవాలు, ఆలోచనలతో రాష్ట్రప్రభుత్వాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తున్నారని, తాము అధికారంలో ఉన్నప్పటికీ, తమను నడిపించేది వారేనన్నారు. కలైంజర్ మహిళా సాధికారిక పథకం వల్ల గృహిణుల ఆర్థిక స్వాతంత్ర్యం బాగా పెరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థల బస్సుల్లో విడియల్ పయనం పథకం కింద ఉచితంగా ప్రయాణం చేస్తున్న మహిళల సామాజిక వాటా కూడా పెరిగిందన్నారు. పుదుమై పెన్ పథకం ద్వారా కళాశాలలకు వెళుతున్న విద్యార్థినుల సంఖ్య కూడా పెరిగిందని, ఈ పథకం విజయవంతం చేసేందుకు ప్రణాళిక కమిటీ సభ్యులు అందిస్తున్న సహకారం గొప్పదన్నారు. ఉదయం అల్పాహారం పథకంతో రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య కూడా పెరిగిందని, అలాగే పాఠశాలల సంఖ్యను కూడా పెంచామన్నారు. అభివృద్ధి అనేది ఆర్థిక వ్యవస్థగా చూడకుండా సమాజాభివృద్ధిగా చూస్తున్నామని, ద్రావిడ మోడల్ ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాల వల్ల అన్నివర్గాల ప్రజలు లబ్ధిపొందగలుగుతున్నారన్నారు. ముఖ్యంగా, రాష్ట్ర ప్రణాళిక కమిటీ నివేదికలు డీఎంకే ప్రభుత్వానికి మార్కుల జాబితా వంటిదని, పరిశ్రమల అభివృద్ధి, సమాజంలో మార్పులు, విద్యారంగంలో అభివృద్ధి ఒకే సమయంలో జరిగేందుకు ఈ కమిటీ తోడ్పడుతుందని సీఎం తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి తంగం తెన్నరసు, ప్రణాళిక కమిటీ వైస్ ఛైర్మెన్ ప్రొఫెసర్ జయరంజన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, అడిషినల్ చీఫ్ సెక్రటరీ మురుగానందం, అడిషినల్ చీఫ్ సెక్రటరీ రమేష్ చంద్ మీనా, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఉదయ్‌చంద్రన్, ప్రణాళిక కమిటీ సభ్యులు ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసన్, ప్రొఫెసర్ విజయభాస్కర్, దీనబంధు, ఎమ్మెల్యే ఎలిళన్, డా.అమర్పావనాధన్, డా.నర్తకి నటరాజ్, కమిటీ మెంబర్ సెక్రటరీ సుధ, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

24 గంటలూ నీటి సరఫరా



- ఐదు వార్డుల్లో అమలు
- తాంబరం కార్పొరేషన్ ప్రయోగాత్మక అమలు

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీటి కష్టాల నుంచి గట్టెక్కించేందుకు తాంబరం కార్పొరేషన్ వినూత్న ప్రయోగం మొదలుపెట్టింది. ఇందులో భాగంగా 24 గంటలూ తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టింది. ముందుగా ఐదు వార్డుల్లో ఈ పథకాన్ని అమలు చేసి, ఆ తరువాత దానిని కార్పొరేషన్ మొత్తం విస్తరించాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. ఐదు మండలాలు, 70 వార్డులతో కూడిన తాంబరం కార్పొరేషన్‌లో 2.52 లక్షల ఇళ్లు, 10 లక్షల జనాభా వుంది. ఈ కార్పొరేషన్‌కు కాంచీపురం జిల్లా ఉత్తిరమేరూర్ సమీపంలో పళయసీవరం, మేలచ్చేరి, విల్లియంబాక్కం ప్రాంతాల పాలారు లోతట్టు బావుల నుంచి కుళాయిలకు తాగునీరు సరఫరా అవుతోంది. పల్లావరం, పమ్మల్, అనాకపుత్తూర్, చీట్లపాక్కం, తిరుసీర్‌మలై ప్రాంతాలకు మెట్రోవాటర్ బోర్డు ద్వారా తాగునీరు సరఫరా జరుగుతోంది. పీర్కంగాళనై వంటి ప్రాంతాలకు స్థానికంగా వున్న బావుల నుంచి నీటిని తరలిస్తున్నారు. వేసవిలో తాగునీటి సరఫరా చేసే చెరువులు ఎండిపోవడం, భూగర్భజలాలు తగ్గిపోవడంతో ఆయా ప్రాంతాలకు తాగునీటి సమస్య ఏర్పడుతోంది. అందువల్ల మూవసరసంపట్టు, తిరుశూలం ప్రాంతాల్లోని క్వారీల్లో వుండే నీటిని శుద్ధీకరించి పల్లావరం చుట్టుపక్కలున్న కొన్ని ప్రాంతాలకు వినియోగిస్తున్నారు. అంతేగాక నెమ్మేరిలోని నిర్లవణీకరణ పథకం ద్వారా రోజుకు 2 కోట్ల లీటర్ల తాగునీటిని పల్లావరం, పమ్మల్, అనకాపుత్తూరు ప్రాంతాలకు అందిస్తున్నారు.అయితే ఇప్పుడు తాంబరం కార్పొరేషన్ 24 గంటలూ తాగునీరు సరఫరా చేసేందుకు సిద్ధమైంది.

వాడుకున్నోళ్లకు వాడుకున్నంత..!

ఈ పథకం అమలులోకి వస్తే ప్రజలు తమకు కావాల్సినంత నీటిని వినియోగించుకోవచ్చు. ప్రతి ఇంటికీ కుళాయిని ఏర్పాటు చేస్తున్న అధికారులు.. దానికి మీటర్ అమర్చనున్నారు. అంటే మనం వినియోగించిన మేరకు డబ్బు చెల్లించాల్సి వుంటుంది. మనం ఉపయోగించే కరెంటుకు తగిన డబ్బు చెల్లిస్తున్నట్లుగానే నీటికీ డబ్బు చెల్లించాల్సివుంటుందన్నమాట. నిజానికి ఈ పథకం ఇప్పటికే ఒడిశా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో అమలులో వుంది. జనవరిలో అక్కడకు వెళ్లిన తాంబరం కార్పొరేషన్ అధికారుల బృందం ఈ పథకంపై అధ్యయనం చేశారు. ఆ తరువాత ఇప్పుడు ప్రయోగాత్మకంగా ఇక్కడ అమలు చేయాలని నిర్ణయించారు.

నీటికి ఇబ్బంది లేనట్లే!

ప్రస్తుతం కార్పొరేషన్ ఎంపిక చేయబడిన వార్డుల్లో గతంలోనే 10,600 తాగునీటి కనెక్షన్లున్నాయి. ఇప్పుడు కొత్తగా 9,400 కనెక్షన్లు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం 7.4 కి.మీ మేర కొత్తగా పైప్‌లైన్ వేయాల్సివుంది. ప్రస్తుతం ట్రయల్ రన్‌గా ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ పథకానికి వచ్చే స్పందన బట్టి మిగిలిన వార్డులకూ విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. ఏ సమయంలో అయినా మంచినీరు లభించేలా ఏర్పాట్లు చేపడుతున్నారు. దీనివల్ల ప్రజలు ఇళ్లలో లోతట్టు బావులు తవ్వుకోవాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. అంతేగాక అన్ని ఇళ్లకూ ఎలాంటి ఇబ్బంది లేకుండా అందరికీ సమాంతరంగా నీరందేలా కుళాయిలు వేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఇళ్లలో వినియోగించేదానిని బట్టి వారికి నెలకు బిల్లు వస్తుందని, కరెంటు మీటరు లానే నీటి మీటరుకు డబ్బు చెల్లిస్తే సరిపోతుందని వారు వివరించారు. దీనివల్ల ప్రజలకు ఎలాంటి నీటి ఇబ్బంది లేకుండా వుండదని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

తొలిదశలో ఐదు వార్డులకు

2, 3 మండలాల్లో వుండే 22, 23, 24, 25, 26 వార్డుల్లో తొలిదశగా ఈ పథకాన్ని అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ 24 గంటలూ మంచినీరు సరఫరా చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం తమిళనాడు టౌన్ ప్లానింగ్ డెవలప్‌మెంట్ రూ.20 కోట్లను కేటాయించింది. ఈ తాగునీటి పథకాన్ని అమలు చేయడానికి టెండర్లు పిలిచి, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.

మళ్లీ విజృంభించిన లంక నావికాదళం

- తూత్తుకుడి జాలర్లు 22 మంది అరెస్ట్
- రెండు పడవల స్వాధీనం

ప్యారీస్, ఆగస్టు 6: సముద్రంలో చేపల వేటకు వెళ్లే తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. తూత్తుకుడికి చెందిన 22 మంది జాలర్లను అరెస్ట్ చేసి, వారి రెండు పడవలను కూడా శ్రీలంక నావికాదళం స్వాధీనం చేసుకుంది. తమిళ జాలర్లపై కొనసాగుతున్న దాడులను ఖండిస్తూ సముద్రతీర జిల్లాల్లో జాలర్లు మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తూత్తుకుడి సమీపంలోని తరువైకుళం జాలర్ల గ్రామానికి చెందిన మత్స్యకారులు మరబోట్లలో సముద్రంలో చేపలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో, ఈ గ్రామానికి చెందిన అంథోని మహారాజ్‌కు చెందిన మరబోటులో గత నెల 21వ తేది 10 మంది, మరో బోటులో 12 మంది చేపల వేటకు వెళ్లారు. వీరు భారత సముద్ర సరిహద్దుల్లో చేపలు పడుతున్నారు. ఆ సమయంలో వచ్చిన శ్రీలంక నావికాదళ సిబ్బంది ఎలాంటి హెచ్చరికల చేయకుండానే తమిళ జాలర్లపై దాడిచేసి 22 మందిని అరెస్ట్ చేసి వారి పడవలు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం తెలిసిన తరువైకుళం గ్రామస్తులు శ్రీలంక నావికాదళానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. అదే విధంగా జిల్లాలోని ఇతర జాలర్ల గ్రామాలు, నాగపట్టణం, పుదుకోట తదితర కోస్తా తీర జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. శ్రీలంక దాడులను అడ్డుకోవడంతో పాటు అరెస్టయిన వారిని, వారి పడవలు విడిపించేలా చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

చెన్నైలోని 776 ప్రాంతాల్లో

'రోడ్ సైడ్ ఫుడ్ సెంటర్లు'

35 వేల మంది వ్యాపారులకు అనుమతి

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్‌సైడ్ తోపుడుబళ్ల కారణంగా సంభవిస్తున్న ట్రాఫిక్ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు కార్పొరేషన్ సిద్ధమైంది. అంతేగాక అపరిశుభ్రంగా తయారు చేసి విక్రయిస్తున్న ఆహార పదార్థాలతో తలెత్తుతున్న విపత్కర పరిణాలను కూడా అడ్డుకునేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఒకే సారి ఈ రెండింటికీ చెక్ పెట్టేందుకు అనువుగా నగర వ్యాప్తంగా ఎవ్వరికీ ఎలాంటి ఇబ్బంది లేని 776 ప్రాంతాల్లో 'రోడ్‌సైడ్ ఫుడ్ సెంటర్లు' ఏర్పాటు చేసేందుకు అనుమతిచ్చింది. తద్వారా 35 వేల మంది వ్యాపారులకు లబ్ది చేకూరడంతో పాటు ప్రజలకు నాణ్యమైన ఆహారం లభించేందుకు మార్గం సుగమమవుతుంది.

చెన్నైలో జనసంచారం అధికంగా వుండే ప్రాంతాల్లో చిన్నతరహా తోపుడు బళ్లు పెరుగుతున్నాయి. దీని వల్ల ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోతుండడంతో పాటు శుభ్రంగా లేని ఆహారం విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై చెన్నై కార్పొరేషన్ కమిషనర్ కుమర గురుబరన్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు, వ్యాపార సంఘాల నేతలు కూలంకషంగా చర్చించారు. చెన్నై నగరంలో ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేయడంపై ప్రధానంగా చర్చ జరిగింది. ఈ చర్చల్లో వచ్చిన సలహాలు, సూచనల మేరకు మండలాలవారీగా రోడ్‌సైడ్ ఫుడ్ సెంటర్లు పెట్టుకునేందుకు అనుమతిచ్చారు. ఆ మేరకు ఉత్తర మండలంలో తాళంగుప్పం మార్కెట్, మనలి పుదునగర్‌లో 80 అడుగుల రోడ్డు, టీహెచ్ రోడ్డు మార్కెట్, ఎంజీ రోడ్డులో వుండే షాపింగ్ కాంప్లెక్స్, సెంట్రల్ చెన్నైలో అంగాళమ్మన్ వీధి, చిన్నబాబు వీధి, కీల్పాక్ గార్డెన్ వీధి, ఆమ్స్ రోడ్డు, పురుషవాక్కం హైరోడ్డు, దక్షిణమండలంలో రంగనాధన్ వీధి, వెంకటనారాయణరోడ్డు, పీవీ రాజమన్నార్‌రోడ్డు, జీఎన్ చెట్టి రోడ్డు, ఎల్‌బీ రోడ్డు, బీసెంత్ అవెన్యూ తదితర 776 చోట్ల రోడ్‌సైడ్ ఫుడ్ సెంటర్లు పెట్టుకునేందుకు అనుమతివ్వాలని నిర్ణయించారు. అయితే అనుమతించబడిన ప్రాంతాల్లో ఫుడ్‌సెంటర్లు పెట్టుకునేవారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సివుంటుంది. నాణ్యమైన ఆహారం ఇవ్వడంపై సర్టిఫికెట్ పొందాలి. అదే విధంగా ఒకేవిధమైన మోడల్లో అంగళ్లు వుండాలని అధికారులు షరతులు విధించారు. రోడ్‌సైడ్ ఫుడ్‌కోర్టు పెట్టుకునేందుకు 35,588 మంది వ్యాపారులకు అనుమతిచ్చారు.



నిబంధనలు అతిక్రమిస్తే శిక్షే

ఉత్తర మండలంలో జనాభా ఎక్కువగా వుండే మూలచక్రం మెయిన్‌రోడ్డు, ప్రకాశం రోడ్డు, ఇళయరోడ్డు, మధ్య మండలంలో కొళత్తూర్ మెయిన్‌రోడ్డు, తిరుమంగళం రోడ్డు, న్యూ ఆవడి రోడ్డు, హండ్రెడ్‌మీటర్స్ రోడ్డు, ఈవీఆర్ పెరియార్ హైరోడ్డు, దక్షిణమండళంలో జోన్స్ రోడ్డు, గంగాధరన్ వీధి, ఆసుపత్రి రోడ్డు, లేబర్ కాలనీ తదితర 491 చోట్ల ఫుడ్ సెంటర్లు పెట్టుకునేందుకు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. అనుమతి లేకండా ఫుడ్‌కోర్టు పెడితే వాటిని తొలగించడంతో పాటు యజమానులకు జరిమానా కూడా విధిస్తామని అధికారులు హెచ్చరించారు.



నూతన మేయర్‌ను అభినందిస్తున్న మంత్రులు

కోవై నగర మేయర్‌గా రంగనాయకి

అభినందనలు తెలిపిన మంత్రులు

అడయార్, ఆగస్టు 6: కోయంబత్తూరు మేయర్‌గా రంగనాయకి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమెకు రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, ఎన్.ముత్తుస్వామి అభినందనలు తెలిపారు. కోవై కార్పొరేషన్‌లో మొత్తం వంద డివిజన్లుండగా, 96మంది డీఎంకే, కాంగ్రెస్ కార్పొరేటర్లుండగా, అన్నాడీఎంకేకు ముగ్గురు, ఎస్‌డీపీఐకు ఒకరు చొప్పున కార్పొరేటర్లు ఉన్నారు. అయితే, 19వ వార్డు కార్పొరేటర్‌గా విజయం సాధించిన కల్పనను కోవై నగర తొలి మేయర్‌గా ఎన్నుకున్నారు. కానీ ఆమె వ్యక్తిగత, అనారోగ్య కారణాలతో ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆమె స్థానంలో కొత్తగా రంగనాయకిని డీఎంకే కూటమి కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోవై కార్పొరేషన్ భవనంలోని విక్టోరియా హాలులో మంగళవారం ఉదయం 10.30 గంటలకు కోవై నగర మేయర్ ఎన్నిక జరిగింది. ఆ వెంటనే ఆమె మేయర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, ఎన్.ముత్తుస్వామి పాల్గొన్నారు. ఆ తర్వాత నగర మేయర్ రంగనాయకిని వారు ప్రత్యేకంగా అభినందించారు.

సమాచార దృష్టి

ఉత్తమ రచయితలకు ఆర్థికసాయం

ఐసిఎఫ్, ఆగస్టు 6: ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ రచయితలకు అందజేసే ఆర్థికసాయానికి ఈ నెల 30వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే కళ, సాహిత్య అభివృద్ధి సంఘం ద్వారా ప్రతి సంవత్సరం ఉత్తమ రచనలు ఎంపిక చేసి రచయితలకు రూ.లక్ష ఆర్థికసాయం అందజేస్తున్నారు. రచయితలకు వయోపరిమితి లేదు. కథలు, వ్యాసాలు, కవితలు, చరిత్ర వంటి వివిధ ఆవిష్కరణలను 90 పేజీలకు తగ్గకుండా రాసి పంపాలి. ఇతర వివరాలకు tn.gov.in/forms అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

నేడు వెటర్నరీ కోర్సుల ర్యాంకుల జాబితా విడుదల

పెరంబూర్, ఆగస్టు 6: తమిళనాడు వెటర్నరీ కోర్సులకు సంబంధించిన ర్యాంకుల జాబితా బుధవారం విడుదల కానుంది. ఈ వర్సిటీ ఆధ్వర్యంలో ని 7 యూజీ వెటర్నరీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ఇటీవల ముగిసింది. వెటర్నరీ కోర్సులకు 14,500 మంది, సాంకేతిక కోర్సులకు 3,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, అడ్మిషన్లకు సంబంధించిన ర్యాంకుల జాబితా బుధవారం ఉదయం 10 గంటలకు https://adm.tanuvas.ac.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నట్లు వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

పరిశ్రమ అభివృద్ధి పథకానికి 32 ఐటీఐల ఎంపిక

ఐసిఎఫ్, ఆగస్టు 6: పరిశ్రమల అభివృద్ధి పథకానికి రాష్ట్రంలో 32 ఐటీఐ లు ఎంపికయ్యాయి. నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి శాఖ ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సాయంతో వివిధ పథకాలు అమలుచేస్తోంది. ఈ పథకం కింద 500 ఐటీఐల్లో ల్యాబ్‌లు, ఉపకరణాలు, పరికరాలు అభివృద్ధి చేయనుంది. రాష్ట్రంలో ఉన్న 29 ప్రభుత్వ, 3 ప్రైవేటు, పుదుచ్చేరిలో 2 ప్రభుత్వ ఐటీఐలు ఈ పథకంలో ఎంపికయ్యాయి.

విద్యార్థులకు నాలుగు జతల యూనిఫారం

పెరంబూర్, ఆగస్టు 6: పాఠశాల విద్యార్థులందరికీ నాలుగు జతల యూనిఫాం అందజేయనున్నట్లు సాంఘిక సంక్షేమం, మహిళా హక్కుల శాఖ మంత్రి గీతా జీవన్ తెలిపారు. యూనిఫాం తయారీకి సిబ్బంది పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల కొలతలు తీసుకోవడంలో జాప్యం చోటుచేసుకుంది. ఈ నెలాఖరులోగా విద్యార్థులందరికీ నాలుగు జతల యూనిఫాం అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు.

కుట్రాలం జలపాతానికి అనుమతి

పెరంబూర్, ఆగస్టు 6: కుట్రాలం ప్రధాన జలపాతంలో స్నానాలకు అనుమతించడంతో పర్యాటకులు హర్షం వ్యక్తం చేశారు. తెన్‌కాశి జిల్లా పశ్చిమ కనుమల కొండల ప్రాంతంలో కుట్రాలం జలపాతం ఉంది. ఈ ప్రాంతంలో సోమవారం ఉదయం భారీవర్షాలు కురియడంతో ప్రధాన జలపాతం, ఐందరువి జలపాతాల్లో వరద ప్రవాహం అధికంగా ఉండడంతో పర్యాటకులను అనుమతించలేదు. మంగళవారం వరద తగ్గుముఖం పట్టడంతో మధ్యాహ్నం నుంచి అన్ని జలపాతాల వద్దకు పర్యాటకులను అనుమతించారు.

1 నుంచి చెన్నై-జాఫ్నా మధ్య విమాన సేవలు

పెరంబూర్, ఆగస్టు 6: చెన్నై-జాఫ్నా మధ్య సెప్టెంబరు 1వ తేది నుంచి విమాన సేవలు ప్రారంభం కానున్నాయి. చెన్నై నుంచి మధ్యాహ్నం 1.55 గంటలకు బయల్దేరే విమానం 3.15 గంటలకు జాఫ్నా చేరుకుంటుంది. మరుమార్గంలో జాఫ్నా నుంచి 3.55 గంటలకు బయల్దేరి సాయంత్రం 5.10 గంటలకు చెన్నై చేరుకుంటుంది. అందుకు ఛార్జీగా రూ.7,604 నిర్ణయించారు. ఇప్పటికే కొలంబోకు విమానాలు నడుపుతున్న ఇండిగో సంస్థ జాఫ్నాకు కూడా విమానాలు నడపనుంది.

రేపు దివ్యాంగులకు గుర్తింపుకార్డుల పంపిణీ శిబిరం

ఐసిఎఫ్, ఆగస్టు 6: ఉత్తర చెన్నై దివ్యాంగులకు జాతీయ గుర్తింపుకార్డులు అందజేసే శిబిరం గురువారం జరుగనుంది. చెన్నై జిల్లాలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని సంక్షేమ కార్యాలయం 2023 మే 15 నుంచి ఉత్తర చెన్నై, దక్షిణ చెన్నై అని రెండుగా ఏర్పడి, దక్షిణ చెన్నై కార్యాలయం డీఎంఎస్ ప్రాంగణంలోను, ఉత్తర చెన్నై కార్యాలయం కలెక్టరేట్ వెనుక వైపు పనిచేస్తున్నాయి. ఉత్తర చెన్నై పరిధిలోని తిరువొత్తియూర్, మనలి, మాధవరం, తండయార్ పేట, రాయపురం, తిరువిక నగర్, అంబత్తూర్, అన్నానగర్‌కు చెందిన దివ్యాంగులు ఈ నెల 8వ తేది ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్టాన్లీ ప్రభుత్వాసుపత్రి పాత ఔట్ పేషంట్ల విభాగం భవనం ఎదుట శిబిరం ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు కార్డులు పొందని వారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఐదు ఫోటోలు, ఒరిజినల్, నకళ్ల గుర్తింపుకార్డులతో హాజరుకావాలి.

నీట్ అభ్యర్థులకు రాష్ట్రంలోనే పరీక్షా కేంద్రాలు

ఐసిఎఫ్, ఆగస్టు 6: పీజీ వైద్య కోర్సులకు సంబంధించిన నీట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జాతీయ వైద్య విజ్ఞాన పరీక్ష బోర్డు రాష్ట్రంలోనే పరీక్షా కేంద్రాలను కేటాయించింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లో పీజీ కోర్సుల అడ్మిషన్లు నీట్ మార్కుల ఆధారంగా జరుగుతున్నాయి. ఈ నెల 11వ తేది జరుగనున్న ఈ పరీక్షకు రాష్ట్రం నుంచి 25,000 మంది సహా దేశవ్యాప్తంగా 2 లక్షల మందికి పైగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్ర అభ్యర్థులకు వారు కోరిన నాలుగు పరీక్షా కేంద్రాలు కేటాయించకుండా ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు కేటాయిస్తున్నారు. దిండుగల్ ఎంపీ సచ్చిదానందం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాను కలిసి అభ్యర్థులకు ఆయా రాష్ట్రాల్లోనే పరీక్షా కేంద్రాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో, 75 శాతానికి పైగా అభ్యర్థులకు రాష్ట్రంలోనే పరీక్షా కేంద్రాలు కేటాయించారు. ఈ వివరాలను వారి మొబైల్ నెంబర్లకు మెసేజ్ ద్వారా పంపించారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయించిన 8 వేల దుకాణాలకు సీలు

ఐసిఎఫ్, ఆగస్టు 6: నగరంలో గత ఎనిమిది నెలల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించిన 8,656 దుకాణాలకు సీలు వేయడంతో పాటు రూ.13.16 కోట్లు జరిమానా వసూలుచేసినట్లు అధికారులు తెలిపారు. ఆహార భద్రతా శాఖ అధికారులు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి పొగాకు ఉత్పత్తులు విక్రయించే వారిపై చర్యలు చేపడుతున్నారు. 2023 నవంబరు నుంచి ఎనిమిది నెలల్లో 1,76,699 కిలోల పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకొని, 19,332 మందిపై కేసులు నమోదుచేసి రూ.13.16 కోట్ల జరిమానా విధించారు. అలాగే, 8,656 దుకాణాలకు సీలు వేశారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

ఐసిఎఫ్, ఆగస్టు 6:పోక్సో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కన్నప్పన్ ఉత్తర్వులు జారీచేశారు. పోక్సో చట్ట విభాగాలకు సంబంధించి జాతీయ పిల్లల హక్కులు, భద్రతా కమిషన్ అవగాహన వీడియోలు తయారుచేసి యూట్యూబ్‌లో విడుదల చేసింది. ఆ వీడియోలను అన్ని పాఠశాలల్లో ప్రసారం చేసి విద్యార్థులకు అవగాహన కల్పించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

కొండచరియలు పడేందుకు అవకాశముండే ప్రాంతాల్లో పరిశీలన

● మంత్రి ముత్తుస్వామి


ఏనుగు దాడిలో గాయపడిన భాస్కరన్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న మంత్రి ముత్తుస్వామి

పెరంబూర్, ఆగస్టు 6: వయనాడులాగా రాష్ట్రంలో కొండచరియలు విరిగిపడే అవకాశముందా అనే అంశంపై పరిశోధన చేపట్టనున్నట్లు గృహవసతి, నగరాభివృద్ధి శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామి తెలిపారు. కోయంబత్తూర్ జిల్లా విరాలియూర్ ప్రాంతంలో ఇటీవల ఏనుగు దాడిలో మృతిచెందిన కార్తీక్ తల్లిదండ్రులను సోమవారం పరామర్శించి ఓదార్చి, సీఎం ప్రకటించిన రూ.10 లక్షల చెక్ అందజేశారు. అలాగే, అదే గ్రామంలో ఏనుగు దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భాస్కరన్, హరీష్‌లకు మంత్రి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈరోడ్, కోవై జిల్లాల్లో ఏనుగులు అడవులు దాటి జనావాసాల్లోకి ప్రవేశించడాన్ని అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఏనుగులు తరచూ ప్రవేశించే గ్రామాల సరిహద్దుల్లో కంచెలు ఏర్పాటుచేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. అటవీ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడే అవకాశముందా అనే విషయమై పరిశోధనలు చేపట్టనున్నామని మంత్రి తెలిపారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్ పాడి, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ జయరాజ్, ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రి డీన్ ఎ.నిర్మల తదితరులున్నారు.

పొరుగు రాష్ట్రాలకు వెళ్తున్న జౌళి సంస్థలను అడ్డుకోవాలి

● అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి



ప్యారీస్, ఆగస్టు 6: మెరుగైన వసతులు అందుబాటులో లేని కారణంగా రాష్ట్రం వదిలి పొరుగు రాష్ట్రాలకు వెళుతున్న జౌళి సంస్థలను అడ్డుకోవాల్సిందిగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి డీఎంకే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... డీఎంకే ప్రభుత్వం కారణంగా రాష్ట్రంలో భారీ పెట్టుబడులతో స్థాపించిన జౌళి పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు వెళ్తున్నాయని ఆరోపించారు. జూలై చివరి వారంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కోవై, తిరుప్పూర్ ప్రాంతాలను సందర్శించారని, ఆయన తిరుప్పూర్ ఎగుమతిదారుల సంఘం, దక్షిణ భారత స్పిన్నింగ్ మిల్లుల సంఘం, భారత పత్తి సమాఖ్యలతో జౌళి పరిశ్రమకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకున్నారని తెలిపారు. ఇందువల్ల రాష్ట్రానికి వచ్చిన జౌళి పరిశ్రమలు పక్కనున్న రాష్ట్రాలకు తరలిపోయే పరిస్థితి నెలకొందని, అయినా ఈ పరిశ్రమలను అడ్డుకొనేందుకు పాలకులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరమని తెలిపారు. ఒప్పందం పత్రాల్లో సంతకాలు చేసిన పరిశ్రమలు మధ్యప్రదేశ్‌కు తరలివెళ్లడం వల్ల ఆ రాష్ట్రంలో పత్తి ఉత్పత్తి సంక్షేమ బోర్డు ఏర్పాటవుతుందని, ఎక్స్‌ట్రా లాంగ్ స్టేబుల్ పత్తి భారీస్థాయిలో తయారవుతోందని, ఆ రాష్ట్రంలో జౌళి పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడులు పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా రాష్ట్రం వదిలి వెళ్తున్న పరిశ్రమలను అడ్డుకొని ఇక్కడే కొనసాగేలా అవసరమైన వసతులు సమకూర్చాలని, దక్షిణ భారత మాంచెస్టర్‌గా పిలువబడుతున్న కోయంబత్తూర్, తిరుప్పూర్, ఈరోడ్ తదితర ప్రాంతాల్లో టెక్స్‌టైల్ రంగాన్ని ఆదుకొనేలా తక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా ఈపీఎస్ డిమాండ్ చేశారు.

యూనియన్ ఛైర్మన్‌గా ఎస్ఐ సతీమణి


గోమతిని అభినందిస్తున్న పార్టీ నేతలు, వార్డు సభ్యులు

పెరంబూర్, ఆగస్టు 6: సేలం అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక ఎస్ఐ రామచంద్రన్ సతీమణి గోమతి డీఎంకే సెంగవల్లి యూనియన్ అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. సేలం జిల్లా ఆత్తూర్ సమీపం సెంగవల్లి యూనియన్ కమిటీ అధ్యక్ష ఎంపిక మంగళవారం జరిగింది. ఈ పదవికి డీఎంకే అభ్యర్థిగా కౌన్సిలర్ గోమతి మాత్రమే నామినేషన్ వేశారు. దీంతో ఆమె ఏకగ్రీవంగా ఎంపికైనట్లు గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ సంఘమిత్ర ప్రకటించారు.

సెంథిల్ బాలాజీ బెయిల్ పిటిషన్ మళ్ళీ వాయిదా

అడయార్, ఆగస్టు 6: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ బెయిల్ పిటిషన్ మరోమారు వాయిదా పడింది. చట్ట వ్యతిరేక నగదు లావాదేవీల కేసులో అరెస్టయి జైలులో ఉంటున్న సెంథిల్ బాలాజీ బెయిల్ కోసం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఈడీ తరపున హాజరైన న్యాయవాది వాదనలు వినిపిస్తూ, సెంథిల్ బాలాజీ నేరానికి పాల్పడినట్టు నిర్ధారించే ఆధారాలున్నాయని, వీటి ద్వారా ఆయనకు శిక్షపడే అవకాశం ఉందన్నారు. అయితే, ఈ అవినీతికి తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన పదేపదే చెబుతున్నారన్నారు. అందువల్ల ఆయనకు బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు. ఈ వాదనలు ఆలకించిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

పుళల్‌లో వ్యక్తి అరెస్టు

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తాగిన మత్తులో ఓ వ్యక్తిపై దాడి చేయడంతో పాటు అతడి శరీరమంతా కొరికిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా వున్నాయి... మాదలంబేడు పెరుమాళ్‌కోయిల్ వీధికి చెందిన మురుగన్ (32) ఆదివారం రాత్రి పని ముగించుకుని టూవీలర్‌పై ఇంటికి వెళ్తూ కావాంగరై సమీపంలోవున్న పెట్రోల్ బంకు వద్ద తన స్నేహితుడి కోసం నిలబడ్డాడు. ఆ సమయంలో అక్కడకు ఆటోలో వచ్చిన భారతినగర్‌కు చెందిన పళని (45) మద్యం మత్తులో మురుగన్‌తో వాగ్వివాదానికి దిగాడు. అంతేగాక మురుగన్‌పై దాడి చేసి, శరీరమంతా కొరికేశాడు.దీంతో తీవ్రంగాగాయపడిన మురుగన్.. సమీపంలో వున్న పోలీసులను ఆశ్రయించగా, వారు.. అతడిని ఆసుపత్రిలో చేర్పించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు పళనిని అరెస్టు చేశారు.

కాంచీపురం టౌన్ ప్లానింగ్ అధికారి ఇంట్లో తనిఖీలు

ప్యారీస్, ఆగస్టు 6: కాంచీపురం కార్పొరేషన్‌లో టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న శ్యామలత ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శ్యామలత 15 ఏళ్లకు పైగా ఇదే పోస్టులో కొనసాగుతూ ఆదాయానికి మించి ఆస్తులు వెనకేసుకున్నారని ఆరోపణలున్నాయి. ఆమె కొన్ని నెలల క్రితం తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు తిరువందిపురం మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. కాంచీపురం బస్టాండ్ సమీపంలో ఉన్న రాజగోపాల వీధిలో శ్యామలత నివసిస్తున్నారు. ఆమె భర్త శేఖర్ తమిళనాడు విద్యుత్ బోర్డులో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, శ్యామలతపై వచ్చిన ఫిర్యాదు ఆధారంగా మంగళవారం ఉదయం ఏసీబీ డీఎస్పీ కలైసెల్వన్, సీఐ సీత నేతృత్వంలోని అధికారుల బృందం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో కాంచీపురం ప్రాంతంలో భూములకు ప్లాన్ మంజూరు చేయడంలో శ్యామలత పెద్ద మొత్తంలో లంచాలు పుచ్చుకున్నారని, ఆమె లాగే భర్త శేఖర్ కూడా అవినీతికి పాల్పడ్డారని విచారణలో తెలిసింది. వారిద్దరూ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టుకోవడంపై అధికారులు వారిని విచారించడంతో పాటు కీలకమైన పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

నేడు ఆధ్యాత్మిక యాత్ర

ఐసిఎఫ్, ఆగస్టు 6: సుబ్రమణ్యస్వామి కొలువుదీరిన ఆరు దివ్యక్షేత్రాల సందర్శనకు ఆధ్యాత్మిక యాత్ర బుధవారం స్వామిమలైలో ప్రారంభం కానుంది. తిరుప్పరంకుండ్రం, తిరుచెందూర్, పళని స్వామిమలై, తిరుత్తణి, పలముదిర్ సోలై క్షేత్రాలకు వృద్ధులను ఉచితంగా తీసుకెళ్లి స్వామి దర్శనం అనంతరం యధాస్థానంలో దింపే కార్యక్రమం రూపొందించారు. ఆ ప్రకారం, 60 నుంచి 70 ఏళ్లలోపున్న 200 భక్తుల చొప్పున ఏడాదికి ఐదు సార్లు 1,000 మంది భక్తులను తీసుకెళ్తున్నారు. తొలివిడత యాత్ర చెన్నై కందకోట్టం నుంచి, రెండో విడత యాత్ర పళని, మూడో విడత యాత్ర తిరుచెందూర్ నుంచి సాగగా, ప్రస్తుతం స్వామిమలై నుంచి 200 మంది సీనియర్ సిటిజన్లతో ఈ యాత్ర ప్రారంభం కానుంది. భక్తులకు బస, భోజనం సదుపాయాలను హిందూ దేవాదాయ శాఖ కల్పిస్తుంది.

1,100 కిలోల గుట్కా స్వాధీనం

● ముగ్గురి అరెస్టు


గుట్కాతో పట్టుబడిన నిందితులు

ఐసిఎఫ్, ఆగస్టు 6: తిరుప్పూర్ మంగళం ప్రాంతంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించి 1,100 కిలోల గుట్కా స్వాధీనం చేసుకొని ముగ్గుర్ని అరెస్ట్ చేశారు. సోమవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టి న పోలీసులు, వేగంగా వెళ్తున్న వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించారు. పోలీసులను గమనించిన వాహన చోదకులు తప్పించుకునేందుకు యత్నించగా పోలీసులు వారిని వెంటాడి పట్టుకున్నారు. వాహనంలో ఉన్న వారిని అదుపులోకి తీసుకొని విచారించగా... బెంగళూరు నుంచి గుట్కా మంగళం సమీపంలో ఉన్న గోడౌన్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన ఫక్రుద్దీన్, అబ్దుల్ రహీమ్, ముత్తుకృష్ణన్ అనే ముగ్గుర్ని అరెస్ట్ చేసి, వాహనంతో సహా 1100 కిలోల గుట్కాను స్వాధీనం చేసుకున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఆగస్టు 6: స్థానిక సత్తువాచేరిలోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇటీవల నీటిలో మునిగి మరణించిన అజిత్‌కుమార్ కుటుంబానికి ముఖ్యమంత్రి జనరల్ నివారణ నిధుల కింద రూ.లక్ష చెక్‌ను కలెక్టర్ సుబ్బులక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ ఆర్తి, మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, సాంఘిక సంక్షేమ శాఖ ప్రత్యేక సబ్ కలెక్టర్ కలియమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మేఘల టెక్నికల్ శిక్షణ కేంద్రంలో ముప్పెరుమ్ వేడుకలు


సర్టిఫికెట్లు అందజేస్తున్న అన్నాడీఎంకే నగర జిల్లా సెక్రటరీ అప్పు

వేలూరు, ఆగస్టు 6: స్థానిక కాట్పాడి డివిజన్ సేర్కాడు జంక్షన్ రోడ్డు అన్నానగర్‌లోని మేఘల టెక్నికల్ శిక్షణా కేంద్రం లో మంగళవారం ముప్పెరుం వేడుకలు నిర్వహించారు. 2024- 25 సంవత్సరం ప్రారంభ వేడుకలు జ్యోతి ప్రజ్వలనతో జరిగాయి. టైప్ రైటింగ్ పాసైన వారికి సర్టిఫికెట్లను అన్నాడీఎంకే నగర జిల్లా సెక్రటరీ ఎస్ఆర్కే అప్పు అందజేశారు. కార్యక్రమంలో వేలూరు టెక్నికల్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనార్థనన్, అఖిల భారత విద్యార్థి సంఘం స్థాపక అధ్యక్షుడు సెంథిల్‌కుమార్, రాజశేఖర్, రాజేష్, ప్రవీణ్, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

10 మంది పుదుచ్చేరి జాలర్లపై కేసులు


● పళవేర్కాడు మత్స్యకారులతో అధికారుల చర్చలు

అడయార్, ఆగస్టు 6: సరిహద్దులుదాటి తమ ప్రాంతంలోని సముద్ర జలాల్లో పుదుచ్చేరికి చెందిన జాలర్లు చేపలు పడుతున్నారంటూ తిరువళ్ళూరు జిల్లా పళవేర్కాడు జాలర్లు ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు పది మంది పుదువై జాలర్లపై కేసులు నమోదు చేశారు. అలాగే, ఇతర ప్రాంత జాలర్లు ప్రవేశించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం నిరవధిక సమ్మెకు దిగారు. దీంతో మత్స్యశాఖ అధికారులతో పాటు రెడ్‌హిల్స్ పోలీసులు చర్చలు జరిపారు. పళవేర్కాడు సముద్ర జలాల్లో చేపలు పుష్కలంగా ఉంటాయి. దీంతో ఇతర ప్రాంతాలు, ఇతర జిల్లాలకు చెందిన జాలర్లు ఈ ప్రాంతానికి వచ్చి చేపలు పడుతున్నారు. ఇందుకోసం నిషేధిత బోట్లు, వలలను ఉపయోగిస్తున్నారు. గత నెల 30వ తేదీన ఈ ప్రాంతానికి చేపల వేటకు వచ్చిన కారైక్కాల్ జాలర్లను చుట్టుముట్టి నిర్బంధించారు. వీరు ఉపయోగించిన 41 పడవలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత శాఖ అధికారులు ఇరు వర్గాలతో చర్చలు జరిపి, కారైక్కాల్ జాలర్లను విడిపించారు. ఈ నేపథ్యంలో సోమవారం పుదుచ్చేరికి చెందిన కొందరు జాలర్లు పళవేర్కాడు ప్రాంతానికి చేపల వేటకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక జాలర్లు వెళ్ళి వారిపై దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు జాలర్లు తీవ్రంగా గాయపడగా వారిని చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇదిలావుంటే, ఇతర ప్రాంతాల జాలర్లు పళవేర్కాడు సముద్ర జలాల్లోకి ప్రవేశించకుండా భారత సముద్రతీర గస్తీదళంతో నిరోధించాలని డిమాండ్ చేస్తూ స్థానిక జాలర్లు ఆందోళనకు దిగారు. దీంతో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ చంద్ర, రెడ్‌హిల్స్ జాయింట్ పోలీస్ కమిషనర్ బాలకృష్ణన్, అసిస్టెంట్ కమిషనర్ రాజా రాబర్ట్, పొన్నేరి తాహసీల్దారు మదివాణన్, ఇండియన్ కోస్ట్‌గార్డ్స్ అధికారులు మంగళవారం జాలర్లతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా 10 మంది పుదుచ్చేరి జాలర్లపై కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మత్తు బిళ్లలు, ఇంజక్షన్ల విక్రయం - ఐదుగురి అరెస్టు

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మత్తు బిళ్లలు, ఇంజక్షన్లు విక్రయిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... పశ్చిమ జాఫర్‌ఖాన్‌పేట, ఎంఏకే స్కూలు సమీపంలో మత్తు మాత్రల్ని నీళ్లలో కలిపి ఇంజక్షన్ ద్వారా మనుషులకు ఎక్కిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎంజీఆర్ నగర్ చూళైపల్లం అబ్రహాం 1వ వీధికి చెందిన సంజయ్ (22) ఆ మత్తు బిళ్లల్ని విక్రయిస్తున్నట్లు తేలడంతో అతడిని అరెస్టు చేశారు. అతడిచ్చి సమాచారం మేరకు ఆదంబాక్కం ప్రాంతంలో బేకరీ నడుపుతున్న కలితీర్థ పెరుమాళ్ (26), గణేష్, విక్రమం, విశ్వలను కూడా అరెస్టు చేశారు. వారి నుంచి 375 సిరంజిలు, 60 మత్తు మాత్రలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. వారికి మత్తు బిళ్లలు, ఇంజక్షన్లు ఎవరు సరఫరా చేస్తున్నారన్నదానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేలమ్మాళ్ బోధి పాఠశాలలో విద్యాభివృద్ధి కార్యక్రమం


కార్యక్రమంలో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఆగస్టు 6: స్థానిక వేలమ్మాళ్ బోధి పాఠశాల ప్రాంగణంలో మంగళవారం పాఠశాల విద్యార్థుల భవిష్యత్తులో విద్యాభివృద్ధి పథకం అనే అం శం పై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పంజాబ్, ఆంధ్రప్రదేశ్, బెంగళూరు సహా పలు ప్రాంతాల్లోని 20కి పైగా ప్రపంచస్థాయి యూనివర్శిటీ లెక్చరర్లు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులకు విద్యావకాశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. వేలమ్మాళ్ గ్రూప్ డైరెక్టర్ ఏవీఎం శశికుమార్ సమావేశాన్ని ప్రారంభించగా, పాఠశాల ప్రిన్సిపాల్ రతికుమార్ వందన సమర్పణ చేశారు.

68కి చేరిన కల్తీ సారా మృతుల సంఖ్య

ఐసిఎఫ్, ఆగస్టు 6: కల్తీ సారా మృతుల సంఖ్య 68కి పెరిగింది. కళ్లకుర్చి కరుణాపురం, శేషసముద్రం, మాధవచ్చేరి ప్రాంతాల్లో జూన్ 19వ తేది కల్తీ సారా తాగి అస్వస్థతకు గురైన 229 మందిలో 67 మంది మృతిచెందగా 161 మంది డిశ్చార్జి అయ్యారు. కరుణాపురానికి చెందిన మోహన్ (50) పుదుచ్చేరి జిప్మర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందారు. దీంతో, ఈ ఘటనలో మృతుల సంఖ్య 68కి పెరిగింది. ఈ ఘటనకు సంబంధించి విల్లుపురం సీబీసీఐడీ 24 మందిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

సచివాలయం-మూడు పాఠశాలలకు బాంబు బెదిరింపు

ప్యారీస్, ఆగస్టు 6: సచివాలయం, నగరంలోని మూడు ప్రైవేటు పాఠశాలలను బాంబు దాడిలో పేల్చివేస్తామని వచ్చిన బెదిరింపు లేఖతో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. పట్టణంబాక్కంలోని చెట్టినాడు విద్యాశ్రమ పాఠశాలకు సోమవారం 9వ సారి రాష్ట్ర డీజీపీ శంకర్ జివాల్ పేరుతో బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. అదే విధంగా పట్టణంబాక్కం, సెయింట్ థామస్ మౌంట్, సచివాలయ ప్రాంగణంలో పెట్టిన బాంబులు పేలుతాయని ఆగంతకులు బెదిరించారు. వెంటనే స్పందించిన పోలీసులు మెటల్ డిటెక్టర్లతో సంబంధిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో బాంబులేవీ లేకపోవడంతో వదంతులుగా నిర్ధారించారు. విద్యాసంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, బాంబు బెదిరింపు చర్యలకు పాల్పడుతున్న వ్యక్తులెవరన్న దానిపై సైబర్ క్రైం పోలీసులు ఆరా తీస్తున్నారు.

గూండా చట్టం కింద ఏడుగురి అరెస్ట్

వేలూరు, ఆగస్టు 6: అరియూర్ పోలీస్‌స్టేషన్ సరిహద్దు ప్రాంతంలో ఎమ్మెల్యే రాజాగా తిరిగొచ్చిన రౌడీ రాజాను గత నెల 7వ తేది ఏడుగురి ముఠా హత్యచేసింది. ఈ కేసులో తేజోష్, అజిత్‌కుమార్, రాజేష్, పూర్ణచంద్రన్, కార్తికేయన్, అభినేష్, విరుపాక్షిపురానికి చెందిన దినేష్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో, ఈ ఏడుగురిని గూండా చట్టం కింద అరెస్ట్ చేసేలా కలెక్టర్ సుబ్బులక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు.

సవుక్కు శంకర్ వ్యవహారం.. పోలీసుల కోరికను నిరాకరించిన హైకోర్టు

ప్యారీస్, ఆగస్టు 6: మహిళా పోలీసులను కించపరిచే విధంగా మాట్లాడిన కేసులో యూట్యూబర్ సవుక్కు శంకర్‌ను పోలీసులు గూండా చట్టం కింద అరెస్ట్ చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ మద్రాసు హైకోర్టులో సవుక్కు శంకర్ తల్లి కమల హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలుచేశారు. ఈ కేసు మంగళవారం హైకోర్టు న్యాయమూర్తులు ఎస్ఎం.సుబ్రమణ్యం, వి.శివజ్ఞానంలతో కూడిన బెంచ్ ముందు విచారణకు వచ్చింది. అప్పుడు పోలీసుల తరఫున హాజరైన ప్రభుత్వ న్యాయవాది, సవుక్కు శంకర్ కేసు విచారణను వాయిదావేయాలని కోరగా హైకోర్టు ధర్మాసనం తిరస్కరించింది.

ఉగ్రవాద సంస్థకు సహకరించిన ఆరుగురి విచారణ

ప్యారీస్, ఆగస్టు 6: నగరంలో జూన్ నెలలో నిషేధిత ఇస్బూ ఉద్దగీర్ ఉగ్రవాద సంస్థకు కొంతమందిని సభ్యులుగా చేర్పిస్తూ పట్టుబడిన ఆరుగురిని కస్టడీలోకి తీసుకొని విచారణ జరపాలని సైబర్ క్రైం పోలీసులు నిర్ణయించారు. ఓ యూట్యూబ్ ఛానల్‌లో ఉగ్రవాద సంస్థకు మద్దతుగా మాట్లాడి ఆ సంస్థలో సభ్యులను చేరుస్తున్నట్లు సోషల్ మీడియాలో కథనాలు హల్‌చల్ చేశాయి. దీంతో రంగంలో దిగిన సైబర్ క్రైం పోలీసులు రాయపేటకు చెందిన హమీద్ హుస్సేన్, అతడి సోదరుడు అబ్దుల్ రెహ్మాన్ సహా ఆరుగురిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. వీరు రాయపేటలోని జానీజాన్‌ఖాన్ వీధిలో ఏర్పాటుచేసిన కార్యాలయం నుంచి యూట్యూబ్ ఛానల్ ద్వారా ఉగ్రవాద సంస్థకు మద్దతుగా ప్రచారం చేస్తున్న వైనం వెలుగుచూసింది. అంతేకాకుండా ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువకులకు బ్రెయిన్ వాష్ చేసి వారిని ఉగ్రవాద సంస్థలో సభ్యులుగా చేర్పించారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ చేపట్టిన ఎన్ఐఏ అధికారులు అరెస్టయిన ఆరుగురిని తమ కస్టడీలోకి తీసుకొని విచారణ జరిపేందుకు కోర్టును ఆశ్రయించనున్నారు.

రౌడీ మణికంఠన్ అరెస్ట్

ప్యారీస్, ఆగస్టు 6: స్థానిక సైదాపేటకు చెందిన ప్రముఖ రౌడీ సోత్తుపానై మణికంఠన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల రెండు కిలోల గంజాయితో పట్టుబడిన అతడిపై కోట్టూరుపురం, సైదాపేట, సేలయూరు, తిరుప్పూర్ జిల్లా ఉడుమలపేట తదితర పోలీస్‌స్టేషన్లలో రెండు హత్యలు, 25కు పైగా హత్యాయత్నం, దౌర్జన్యం కేసులున్నాయి. ఓ కేసులో జైలు నుంచి బెయిలుపై విడుదలైన మణికంఠన్ పోలీసుల కళ్లుగప్పి అజ్ఞాతంలోకి జారుకున్నాడు. ఎట్టకేలకు అతన్ని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

రూ.60 లక్షల నకిలీ నోట్లు స్వాధీనం

● ముగ్గురి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న నకిలీ నోట్లు

ఐసిఎఫ్, ఆగస్టు 6: తిరునల్వేలి సమీపంలో రూ.60 లక్షల నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు ముగ్గుర్ని అరెస్ట్ చేశారు. మదురైకి చెందిన ఓ ముఠా తిరునల్వేలి జిల్లా మీదుగా కన్నియాకుమారికి కారులో నకిలీ నోట్లు తరలిస్తున్నట్లు సోమవారం రాత్రి మూన్రడైప్పు పోలీసులకు సమాచారం అందింది. నెడుంకుళంవిళక్కు ప్రాంతంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ మార్గంగా వచ్చిన ఓ కారు ఆపి అందులో ఉన్న వారిని విచారించగా పొంతన లేని సమాధానాలిచ్చారు. అనుమానించిన పోలీసులు వాహనం పత్రాలు పరిశీలించగా, కారు రిజిస్టర్ నెంబరు నకిలీదని తెలిసింది. కారులో తనిఖీ చేసిన పోలీసులు ఓ పెట్టెలో రూ.500 నకిలీ నోట్లు గుర్తించారు. శంకరన్‌కోయిల్‌కు చెందిన తంగరాజ్, విష్ణుశంకర్, విరుదునగర్ జిల్లా శివకాశికి చెందిన పాండ్యన్‌లను అరెస్ట్ చేసి, వారి నుంచి 8 సెల్‌ఫోన్లు, వేటకొడవలి, కత్తులు, రూ.1.13 లక్షల నగదు, రూ.60 లక్షల విలువైన నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు.

ఎడప్పాడి పోలీస్‌స్టేషన్‌పై పెట్రో బాంబు దాడి

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా ఎడప్పాడి ఎడప్పాడి పోలీస్ స్టేషన్‌పై మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు రెండు పెట్రోల్ బాంబులతో దాడి చేశారు. క్షణాల్లో ఒకదానితరువాత ఒకటిగా రెండు పెట్రోల్ బాంబులను విసిరిన దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ బాంబుల పేలుడుకు చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు లోనయ్యారు. కాగా ఈ పెట్రోల్ బాంబుల దాడితో ఒక్కసారిగా దిగ్భ్రాంతి చెందిన పోలీసులు స్టేషన్ నుంచి బయటకు వచ్చి మంటలను అదుపు చేశారు. అనంతరం ఆగంతకుల కోసం అన్వేషణ మొదలుపెట్టారు. కాగా పోలీస్ స్టేషన్‌పైనే దాడికి పాల్పడిన వ్యవహారాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈ ఆగంతకుల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

పుత్తూరుకు చెందిన అసిస్టెంట్ ఎడిటర్ మృతి

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సినీ అసిస్టెంట్ ఎడిటర్‌గా పని చేస్తున్న తిరుపతి జిల్లా పుత్తూరుకు చెందిన మణిరత్నం రెడ్డి వడపళనిలో మృతి చెందారు. 'టౌన్‌బస్' అనే లాడ్జిలో బస చేసిన ఆయన గత వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం. మంగళవారం ఉదయం ఆయన మందులు కొనుగోలు చేసేందుకు లాడ్జి నుంచి బయటకు వచ్చారు. బయటకు రాగానే ఆయన స్పృహ తప్పి పడిపోయారు. దీనిని గమనించిన చుట్టుపక్కల వారు 108 అంబులెన్సును రప్పించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు తేలింది. ఆయన మృతదేహాన్ని కేకే నగర్ ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల స్వాధీనం



వేలూరు, ఆగస్టు 6: గుడియాత్తం కొండా సముద్రం పంచాయతీ పరిధిలోని సామియార్ మలై ప్రాంతంలో మంగళవారం వేకువజామున పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వచ్చిన ట్రాక్టర్లను ఆపేందుకు యత్నించగా, ట్రాక్టర్లు నిలిపివేసిన డ్రైవర్లు అక్కడి నుంచి పరారయ్యారు. ఒక్కొక్క ట్రాక్టర్‌లో యూనిట్ ఇసుక ఉందని, ఈ ఇసుకను అక్రమంగా తీసుకొచ్చినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ వ్యవహారంలో ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు, పరారైన డ్రైవర్ల కోసం గాలిస్తున్నారు.

రామ నారాయణన్
సినిమాటిక్ యూనివర్స్ నుంచి 'ఆడి వెల్లి'



దివంగత రామ నారాయణన్ సినిమాటిక్ యూనివర్స్ నుంచి 'ఆడి వెల్లి' పేరుతో ఓ సినిమా తెరకెక్కనుంది. 1990లో ఇదే పేరుతో ఓ సినిమాను రామ నారాయణన్ తెరకెక్కించారు. నిళల్‌గల్ రవి, సీత తదితరులు నటించగా సూపర్‌హిట్‌గా నిలిచింది. శ్రీ తేనాండాళ్ ఫిలిమ్స్ పతాకంపై ఎన్.రామస్వామి ఈ సినిమాను మరోమారు నిర్మించనున్నారు. దీనికి సంబంధించి 'రామ నారాయణన్ సినిమాటిక్ యూనివర్స్' ప్రకటనతో ఈ సినిమాకు సంబంధించిన వీడియో విడుదల చేశారు. వీవీ ధరణికుమార్ దర్శకుడు. 'దుష్ట శక్తి రాజ్యమేలుతున్నపుడు దైవశక్తి మేల్కొంటుంది' అనే క్యాప్షన్ జోడించారు. భక్తికి సైన్స్‌కు మధ్య జరిగే ఘర్షణగా ఈ కథ సాగుతుంది. 'జంగిల్ బుక్' సినిమాకు పనిచేసిన హాలీవుడ్ సంస్థ ఈ చిత్రానికి గ్రాఫిక్ వర్క్స్ పూర్తి చేయనుంది. ఈ సినిమాలో ఒక చిన్న ఏనుగు, నాగుపాములు ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నాయి. తమిళం, తెలుగు, కన్నడ మలయాళ, హిందీ భాషల్లో నిర్మితంకానున్న ఈ చిత్రం వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.

నటన నా ప్రాణం...
విడిచి వెళ్ళే ప్రసక్తే లేదు

● చియాన్ విక్రమ్

చిత్రజ్యోతి

నటన తన ప్రాణమని, దానిని విడిచివెళ్ళే ప్రసక్తే లేదని హీరో చియాన్ విక్రమ్ స్పష్టం చేశారు. ఆయన హీరోగా దర్శకుడు పా.రంజిత్ తెరకెక్కించిన చిత్రం 'తంగలాన్' ఈ నెల 15వ తేదీన విడుదలకానుంది. దీనిని పురస్కరించుకుని సోమవారం రాత్రి చెన్నై ట్రేడ్ సెంటరులో ఆడియో రిలీజ్ ఫంక్షన్ గ్రాండ్‌గా నిర్వహించారు. ఇందులో సీనియర్ నటుడు శివకుమార్, దర్శకుడు ఏఎల్ విజయ్, నిర్మాత ధనుంజయన్ వంటి పలువురు సినీ ప్రముఖులతో పాటు యూనిట్ సభ్యులంతా పాల్గొన్నారు. హీరో విక్రమ్ మాట్లాడుతూ, 'అన్నియన్, పితామహన్, ఐ, రావణన్ వంటి చిత్రాల కోసం నేను కష్టపడినట్టు చెబుతుంటారు. కానీ, 'తంగలాన్' సినిమా కోసం పడిన కష్టంతో పోల్చితే అది కష్టమే కాదు. నా నటన గురించి నేను గొప్పగా చెప్పుకుని గర్వపడను. శంకర్, మణిరత్నం, ధరణి, పా.రంజిత్, బాలా, ఏఎల్ విజయ్ వంటి దర్శకులు నాలో నటుడిని వెలికితీశారు. ఆ ఘనత వారికే దక్కుతుంది. నటన నా ప్రాణం. దాని నుంచి పక్కకు తప్పుకోవడమో, విరమించడమో జరగదు. స్కూల్‌లో చదువుకునే రోజుల్లో టాప్-3 విద్యార్థుల్లో ఒకడిని. నటనపై ఆసక్తి వచ్చిన తర్వాత చివరి ముగ్గురు విద్యార్థుల్లో ఒకడిగా మారాను. ఒకానొక సమయంలో ప్రమాదంలో కాలు విరిగిపోయింది. 23 చోట్ల ఆపరేషన్, మూడేళ్ళపాటు మంచానికే పరిమితమయ్యాను. ఇకపై నిలబడటం కూడా కష్టమని వైద్యులు తేల్చేశారు. కానీ పట్టుదల నడిచేలా చేసింది. ఆ తర్వాత సినిమా అవకాశాల కోసం వేట మొదలుపెట్టాను. ఇంటి ఖర్చుల కోసం దొరికిన పని చేశాను. పదేళ్ళ పోరాటం తర్వాత సినిమా ఛాన్స్ వచ్చింది. లక్ష్యానికి చేరుకోవాలంటే ఆ లక్ష్యం వైపు పయనిస్తూనే ఉండాలి. ఒక వేళ నేను సక్సెస్ కాకుంటే ఇప్పటికీ పోరాటం చేస్తూనే ఉండేవాడిని. ఎట్టిపరిస్థితుల్లోనూ నటన నుంచి దూరమయ్యేవాడిని కాదు. సాధారణంగా ఒక పాత్ర రాసి అందులో నటించాలని దర్శకులు కోరుతుంటారు. కానీ, తొలిసారి నా కోసం రాసిన పాత్ర 'తంగలాన్'. ఇందులో నటించడానికి ముఖ్య కారణం..తంగలాన్ ఎవరో కాదు. నేనే. నాలోని పోరాటగుణం, పట్టువదలని ప్రయత్నం, కసి.ఇలాంటి అనేక అంశాలు తంగలాన్‌లో ఉన్నాయి. అతడ్ని ఓడించడం నీ వల్ల కాదని వెంటవున్నవారు చెప్పినా వినకుండా పోరాడుతాడు. తన ప్రజల కోసం, తన కుటుంబ సభ్యుల కోసం పోరాటం చేస్తాడు. ఆ పాత్రలో నన్ను నేను చూసుకున్నాను' అని విక్రమ్ వివరించారు. చిత్ర దర్శకుడు పా.రంజిత్ మాట్లాడుతూ, 'సినిమా నన్ను ఎంచుకోలేదు. నేను సినిమాను ఎంచుకున్నాను.చరిత్ర ఎపుడూ పక్షపాతంగా ఉంటుంది. అణగారిన ప్రజలవైపు ఉండదు. ఆ చరిత్రను నా సినిమాల ద్వారా శోధిస్తున్నాను. అణగారిన వర్గాల కోసమే నేను సినిమాలు చేస్తాను. అందుకోసమే బాబా సాహెబ్ అంబేద్కర్ ఇక్కడకు పంపారు. ఆయన సిద్ధాంతాలను తు.చ తప్పకుండా పాటించే శిష్యుడిని, వీరాభిమానిని. సినిమాను ప్రేమించే వ్యక్తులతో కలిసి పనిచేయడం ఎంతో సులభం. ఈ కథ విక్రమ్ అంగీకరించిన తర్వాతే నాకు అసలు సవాల్ ఎదురైంది' అని పేర్కొన్నారు. ఆ తర్వాత చిత్ర బృందంతో పాటు సినీ ప్రముఖులు ప్రసంగించారు. స్టూడియో గ్రీన్, నీలం ప్రొడక్షన్ సంయుక్తంగా పాన్ ఇండియా మూవీగా నిర్మించాయి. సంగీతం అనిరుద్, నిర్మాత కే.జ్ఞానవేల్ రాజా.



విక్రమ్, రంజిత్, పార్వతి, మాళవిక, శివకుమార్

విజయ్‌తో డిన్నర్ చేయాలనివుంది



● ఐశ్వర్య రాజేష్

స్టార్ హీరో విజయ్‌తో కలిసి డిన్నర్ చేయాలని ఉందని హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ తన మనసులోని మాటను వెల్లడించింది. అయితే, ఆమెకు ఆ భాగ్యం లభిస్తుందా లేదా అన్నది కాలమే సమాధానం చెప్పాలి. జీవీ ప్రకాష్ కుమార్‌తో కలిసి 'డియర్' సినిమా తర్వాత 'మోహన్‌దాస్', 'కరుప్పార్ నగరం' వంటి చిత్రాల్లో నటించిన ఐశ్వర్య రాజేష్.. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ భాషల్లో కూడా నటించారు. ముఖ్యంగా తమిళ, తెలుగు భాషా చిత్రాలపై అధిక దృష్టిసారించి వరుస అవకాశాలను దక్కించుకుంటున్నారు. ఇలా బిజీగా ఉంటున్న ఐశ్వర్య తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ఏ హీరోతో డిన్నర్ చేయాలని ఉందని అడడగా విజయ్‌తో కలిసి డిన్నర్‌కు వెళ్ళేందుకు ఆశపడుతున్నట్టు వెల్లడించారు. ఇపుడు ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

అమ్మవారి ఆలయాల్లో

కోలాహలంగా ఆడిపూరం వేడుకలు





క్షీర కలశాలతో అమ్మవారి దర్శనానికి వచ్చిన మహిళలు - అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న ఆదిపరాశక్తి పీఠాధిపతి

ప్యారీస్, ఆగస్టు 6: రాష్ట్రంలో అమ్మవారు కొలువైవున్న ఆలయాల్లో ఆడి మాసాన్ని పురస్కరించుకుని ఆడిపూరం వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి జన్మ నక్షత్రం పూరం కావడంతో ముత్తయిదువులు విశేషంగా అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి క్షీరాభిషేకంలో పాల్గొన్నారు. తిరుచ్చి జిల్లాలోని సమయపురం మారియమ్మన్ ఆలయం, మదురై మీనాక్షి ఆలయం, కాంచీపురం కామాక్షి ఆలయం, మాంగాడు కామాక్షి ఆలయం, తిరువేర్కాడు దేవి కరుమారియమ్మన్ ఆలయం, తిరువొత్తియూర్ వడివుడయమ్మన్ అమ్మవారి ఆలయం, మైలాపూర్ ముండకన్ని అమ్మవారి ఆలయాల్లో ఆషాఢ మాసంలో వచ్చే చివరి ఆదివారం రోజు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కాగా, చెంగల్పట్టు జిల్లాల్లో ప్రసిద్ధిచెందిన మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి సిద్ధర్ పీఠం ఆధ్వర్యంలో 53వ వార్షిక ఆడిపూరం వేడుకలు ఈ నెల 5న ప్రారంభమయ్యాయి. మంగళవారం కలశ పూజ, దీప పూజల్లో ముత్తయిదువులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పీఠాధిపతి అన్బళగన్, సెంథిల్‌కుమార్, శ్రీదేవి రమేష్ పర్యవేక్షణలో చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ ఆదిపరాశక్తి అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు.



ఆనకట్ట షట్టర్లకు ప్రత్యేక పూజలు

చివరి ఆయకట్టుకు చేరిన కావేరి జలాలు

● పూలు చల్లి ఆహ్వానించిన రైతులు



పూలు చల్లి కావేరి జలాలను ఆహ్వానిస్తున్న రైతులు

పెరంబూర్, ఆగస్టు 6: కావేరి చివరి ఆయకట్టు ప్రాంతమైన నాగపట్టణం జిల్లా ఇరయాంకుడి ఆనకట్టకు చేరుకున్న కావేరి జలాలకు రైతులు పూలు చల్లుతూ, మహిళలు నృత్యం చేస్తూ ఆహ్వానం పలికారు. మెట్టూరు జలాశయం నుంచి గత నెల 28వ తేది డెల్టా జిల్లాలకు విడుదల చేసిన కావేరి జలాలు తంజావూరు జిల్లా కల్లనై జలాశయానికి చేరుకున్నాయి. అక్కడి నుంచి 31వ తేది నాగపట్టణం, తిరువారూరు జిల్లాలకు సాగునీరు విడుదల చేశారు. కల్లనై నుంచి విడుదల చేసిన జలాలు వెన్నార్రులో విడిపోయి పాండవయారు నది మీదుగా నాగపట్టణం జిల్లాలోని చివరి ఆయకట్టు ప్రాంతమైన కీళైయూరు పంచాయతి ఇరైయాంకుడి ఆనకట్టకు మంగళవారం చేరుకున్నాయి. ఆ ప్రాంత రైతులు పూలు చల్లి, బాణాసంచా కాల్చుతూ ఆహ్వానం పలికారు. అలాగే, ఆనకట్ట షట్టర్లకు దీపారాధన, సూర్య భగవానుడికి పూజలు నిర్వహించారు. ఈ నీటి ద్వారా ఇరయాంకుడి, పనైయూర్, వల్లినాయకన్‌కోట్టం, కలత్తికరై, మగిళి తదితర ప్రాంతాల్లో వ్యవసాయ భూములకు సాగు నీరు అందుతుందని రైతులు పేర్కొన్నారు.

వైభవంగా సెబాస్టియన్ చర్చి వేడుకలు



వంటల తయారీలో...



కూరగాయలు కోస్తున్న పిల్లలు

పెరంబూర్, ఆగస్టు 6: దిండుగల్-పళని రోడ్డు సమీపంలో ముత్తలకుపట్టిలో సెబాస్టియన్ చర్చి ఉంది. ప్రతి ఏడాది ఈ చర్చిలో మూడు రోజులు ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, ఈ ఏడాది ఉత్సవాలు ఆదివారం పతకావిష్కరణతో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ప్రపంచంలో శాంతి నెలకొనాలని కోరుతూ పావురాలను ఎగురవేశారు. ఉత్సవాల్లో ప్రతిరోజు ప్రత్యేక ప్రార్థనలు, సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. ఈ చర్చికి వచ్చి ప్రార్థనలు చేసిన భక్తులు, తమ కోర్కెలు నెరవేరితో మేకలు, గొర్రెలు, కోళ్ల, బియ్యం, కూరగాయలు తదితరాలు కానుకలుగా చెల్లిస్తుంటారు. అలా, భక్తులు అందించే వాటితో వంట చేసి భక్తులకు భోజనం పెడుతుంటారు. ఆ ప్రకారం, ఈ ఏడాది సుమారు 150కి పైగా మేకలు, గొర్రెలు, నాటు కోళ్లను భక్తులు కానుకగా సమర్పించారు. మంగళవారం ఉదయం వాటి మాంసంతో వంటలు చేసి, తొలుత సెబాస్టియన్‌కు నైవేద్యం సమర్పించిన అనంతరం, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విందు నిర్వహించారు. ఉదయం నుంచే వంటలు చేసేందుకు గ్రామానికి చెందిన యువకులు, చిన్నపిల్లలు, మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు మాట్లాడుతూ... జాతి మత బేధాలు లేకుండా ఐకమత్యం కోరుతూ 350 ఏళ్లుగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

వైభవంగా అయ్యారప్పన్ రథోత్సవం



రథం లాగుతున్న భక్తులు

ఐసిఎఫ్, ఆగస్టు 6: ఆడిపూరం ఉత్సవాలను పురస్కరించుకొని తిరువయ్యారు అయ్యారప్పన్ ఆలయ రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. తంజావూరు జిల్లా తిరువయ్యారులో ధరుమపురం ఆధీనం మఠానికి చెందిన అరంవలర్తనాయగి సమేత అయ్యారప్పన్ ఆలయంలో ప్రతిఏటా ఆడిపూరం ఉత్సవాలు 11 రోజుల పాటు నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, ఈ ఏడాది ఉత్సవాలు జూలై 29న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు ఉదయం పల్లకీలో, సాయంత్రం వివిధ వాహనాల్లో ప్రత్యేక అలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. రథోత్సవం మంగళవారం ఉదయం ఘనంగా జరిగింది. ముందుగా దేవర్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపారాధన అనంతరం రథంపై ఆశీనులను చేశారు. భక్తుల 'ఓం శక్తి...ఓం శక్తి' అంటూ దివ్యనామస్మరణ చేస్తూ భక్తులు రథాన్ని లాగారు.



వెంకన్న సేవలో మంత్రి రామచంద్రన్

తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం తమిళనాడు మంత్రి రామచంద్రన్ దర్శించుకున్నారు.ఈయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

'ప్రపంచ ఉక్కు మనిషి' పోటీలకు శిక్షణ



శిక్షణలో కన్నన్

పెరంబూర్, ఆగస్టు 6: కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ సమీపం తామరైకుట్టి గ్రామానికి చెందిన ఎంఏ పట్టభద్రుడు కన్నన్. కళాశాల విద్యార్థినుల మధ్య అధిక బరువైన వస్తువులను ఎత్తే శిక్షణ చేపట్టారు. అక్టోబరులో స్పెయిన్‌లో జరుగనున్న 'ప్రపంచ ఉక్కు మనిషి' పోటీల్లో పాల్గొననున్నట్లు, ఈ పోటీల్లో తప్పక విజయం సాధిస్తానని, అందువల్ల కఠోర శిక్షణ చేస్తున్నట్లు కన్నన్ తెలిపారు.

ప్రత్యేక రైళ్ల సేవల పొడిగింపు

పెరంబూర్, ఆగస్టు 6: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నడుపుతున్న ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగిస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.06085 ఎర్నాకుళం-పాట్నా వారాంతపు రైలు సేవలు (శుక్రవారం) ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 6వ తేది (4 ట్రిప్పులు), నెం.06086 పాట్నా-ఎర్నాకుళం వారాంతపు రైలు సేవలు (సోమవారం) ఈ నెల 19 నుంచి సెప్టెంబరు 9వ తేది వరకు (4 ట్రిప్పులు) పొడిగించారు.
- నెం.06059 కోయంబత్తూర్-బరౌని వారాంతపు రైలు (మంగళవారం) ఈ నెల 13 నుంచి సెప్టెంబరు 3వ తేది (4 ట్రిప్పులు), నెం.06060 బరౌని-కోయంబత్తూర్ వారాంతపు రైలు (శుక్రవారం) ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 6వ తేది (4 ట్రిప్పులు) పొడిగించారు. ● నెం.06063 కోయంబత్తూర్-దన్‌బాద్ వారాంతపు రైలు (శుక్రవారం) ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 6వ తేది (4 ట్రిప్పులు), నెం.06064 దన్‌బాద్-కోయంబత్తూర్ వీక్లీ రైలు (సోమవారం) ఈ నెల 19 నుంచి సెప్టెంబరు 9వ తేది (4 ట్రిప్పులు) పొడిగించారు. ● నెం.06087 తిరునల్వేలి-షాలిమార్ వారాంతపు రైలు (గురువారం) ఈ నెల 15 నుంచి సెప్టెంబరు 5వ తేది (4 ట్రిప్పులు), నెం.06088 షాలిమార్-తిరునల్వేలి వారాంతపు రైలు (శనివారం) ఈ నెల 17 నుంచి సెప్టెంబరు 7వ తేది (4 ట్రిప్పులు) పొడిగించారు. ఈ రైళ్ల ముందస్తు రిజర్వేషన్ బుధవారం నుంచి ప్రారంభం కానుంది.

చెట్‌పెట్-స్టెర్లింగ్ రోడ్డు మధ్య పూర్తయిన మెట్రో సొరంగం తవ్వకాలు



సొరంగం తవ్వి బయటకు వస్తున్న సిరువాణి యంత్రం

పెరంబూర్, ఆగస్టు 6: మెట్రోరైలు పథకంలో చెట్‌పెట్ నుంచి స్టెర్లింగ్ రోడ్డు వరకు 703 మీటర్ల వరకు సొరంగ మార్గం తవ్వే పనులు సోమవారంతో ముగిశాయి. చెన్నై మెట్రోరైలు రెండో విడత ప్రాజెక్ట్ 3వ మార్గంలో కెల్లీస్ నుంచి తరమణి వరకు 12 కి.మీ మేర సొరంగ మార్గం తవ్వే పనులను ఎల్ అండ్ టీ సంస్థ చేపట్టింది. ఈ మార్గంలో 8 యంత్రాల సాయంతో సొరంగం తవ్వే పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, చెట్‌పెట్ నుంచి స్టెర్లింగ్ రోడ్డు జంక్షన్ వరకు సొరంగం తవ్వే పనులు 2023 ఆగస్టు 9వ తేది 'సిరువాణి' అనే యంత్రంతో ప్రారంభించారు.. కూవం నది కింత 8.0 మీటర్ల లోతులో 51 మీటర్ల పొడవున 703 మీటర్ల దూరం సొరంగం తవ్వే పనులు పూర్తిచేసిన సిరువాణి, సోమవారం బయటకు వచ్చింది. చెన్నై మెట్రోరైలు సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.అర్జునన్, ఎల్ అండ్ టీ ప్రాజెక్ట్ ఇంజనీర్ జయరామన్ పనులు పూర్తిచేసి బయటకు వచ్చిన యంత్రానికి స్వాగతం పలికారు.

20 రోజుల్లో 80 వేల మంది

● బీఎస్ఎన్ఎల్‌కు 'హలో' చెప్పిన వినియోగదారులు

వేళచ్చేరి, ఆగస్టు 6: రాష్ట్రంలో ప్రైవేటు సెల్‌ఫోన్ సంస్థలు రీచార్జీ ధరలను పోటాపోటీగా పెంచడంతో, ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ వైపు ప్రజలు మొగ్గుచూపుతున్నారు. ప్రైవేటు సంస్థలకు సవాలు చేసేలా బీఎస్ఎన్ఎల్ తన నెలసరి చార్జీలను తగ్గించడంతో, కొత్తగా 80వేలమంది వినియోగదారులు చేరారు. అది కూడా 20 రోజుల్లో 80 వేల మంది ప్రైవేటు సంస్థల నుంచి బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు మారారు. జూలై మొదటి వారం నుంచే జియో, భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా తదితర సంస్థలు తమ చార్జీలను 25 శాతం వరకు పెంచడంతో వినియోగదారులు దిగ్భ్రాంతి చెందారు. దీంతో, తమకు సరమైన ధరలకు వచ్చే సంస్థను ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, బీఎస్ఎన్ఎల్ నెలచార్జీలు తక్కువగా ఉండడంతో అధిక శాతం మంది ప్రైవేటు సంస్థల నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మారుతున్నారు. తిరుచ్చిలో అధికంగా 16,000 మంది బీఎస్ఎన్ఎల్ కొత్త సిమ్ కార్డులు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.



చెన్నై, చూలైమేడులోని జయ్‌గోపాల్ గరోడియా ప్రభుత్వ మహిళా మహోన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన బాలికల భద్రతపై చేపట్టిన అవగాహన కార్యక్రమంలో ఫ్లెక్సీపై సంతకం చేస్తున్న సాంఘిక సంక్షేమం, మహిళా హక్కుల శాఖ మంత్రి గీతా జీవన్



వయనాడు విపత్తు బాధితులను ఆదుకొనేందుకు మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధికి గాను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు అన్నాడీఎంకే తరపున రూ. కోటి చెక్కు అందజేస్తున్న ఆ పార్టీ సీనియర్ నేతలు ఎస్పీ వేలుమణి, తదితరులు

నేడు అమ్మవారి ఆలయాల్లో ఆడిపూరం ఉత్సవాలు



గాజుల అలంకరణలో త్రిపురసుందరి అమ్మవారు

ఐసిఎఫ్, ఆగస్టు 6: రాష్ట్రవ్యాప్తంగా అమ్మవార్లు కొలువుదీరిన ఆలయాల్లో బుధవారం ఆడిపూరం ఉత్సవాలు జరుగనున్నాయి. శివుడికి తిరువాదిరై నక్షత్రం ఎలాగో అమ్మవారికి పూరం నక్షత్రం ప్రత్యేకమైనది. ఈ నేపథ్యంలో, అమ్మవారి ఆలయాల్లో బుధవారం ఆడిపూరం ఉత్సవాలు జరుగనున్నాయి. తిరువళ్లూర్‌లో ఉన్న తీర్థీశ్వరర్ ఆలయ ప్రాంగణంలోని త్రిపురసుందరి ఉత్సవమూర్తికి గాజులతో అలంకరించిన పందిరిలో భక్తులకు దర్శనమిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు గాజులు, కుంకుమ ప్రసాదాలు అందజేస్తారు. పుట్లూరు అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ ఉత్సవాలను పురస్కరించుకొని అనేక మంది వివాహం, సంతాన సాఫల్యం కోసం మహిళలు, సుఖ ప్రసవాల కోసం గర్భిణులు పూజలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరిస్తుంటారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో ప్రత్యేకత కలిగిన అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, క్షీరాభిషేకాలు జరుగనున్నాయి.